క్లుప్తంగా

దేవాలయాల అభివృద్ధికి కృషి

మన్ననూర్: దేవాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. ఆలయ కమిటీ కాల పరిమితి ముగియడంతో ప్రస్తుతం వారిమధ్య విభేదాలు రావడంతో ఆదివారం గ్రామస్తులతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా గ్రామస్తుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రెండు మూడు రోజుల్లో ఆలయ కమిటీ సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. అందరి సమన్వయంతో అమ్మవారి శోభాయాత్ర నిర్వహించాలని కోరారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని అమ్రాబాద్ సీఐ శంకర్‌నాయక్‌కు సూచించారు.

స్వాగత ద్వారం ప్రారంభం



లింగాల: మండల కేంద్రంలోని మూడో వార్డు స్వాగత ద్వారాన్ని శనివారం వార్డు ప్రజలు ప్రారంభించారు. వార్డు ప్రజలు చందాలు వేసుకొని స్వాగత ద్వారాన్ని నిర్మించినట్లు స్థానికులు తెలిపారు.

23 నుంచి ఉచిత టైలరింగ్

నాగర్‌కర్నూల్‌రూరల్: సత్యసాయి బాబా 99వ జయంతి సందర్భంగా ఈ నెల 23 నుంచి ఉచిత టైలరింగ్‌లో శిక్షణ నిర్వహిస్తునట్లు సాయిప్రశాంతి చారిటబుల్ సేవా ట్రస్ట్ కార్యదర్శి ఎలిమే ఈశ్వరయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణ 45 రోజుల పాటు కొనసాగుతుందని పేర్కొన్నారు. టైలరింగ్‌తో పాటు మగ్గం, జూట్‌బ్యాగ్స్ తయారీలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు ప్రత్యేక పూజలు



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ దేవతను ఆదివారం మాజీ జెడ్పీటీసీ మేకల గౌరమ్మ, చంద్రయ్య, మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. దసరా పండుగ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో చింతకంట్ల వెంకటస్వామి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఏఎస్‌ఐపై చర్యలు తీసుకోవాలి

నాగర్‌కర్నూల్ క్రైం: అకారణంగా యువకులపై దాడి చేసిన ఏఎస్‌ఐ చర్యలు తీసుకోవాలని గన్యాగుల గ్రామస్తులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పండగ సందర్భంగా గ్రామానికి చెందిన మహేష్, శివ, హరికృష్ణ, నాగరాజులు జిల్లా కేంద్రంలోని మినీట్యాంక్‌పై జమ్మి కోసం వెళ్తే అక్కడే ఉన్న ఏఎస్‌ఐ నిరంజన్ రెడ్డి అకారణంగా దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎమ్మెల్యేకు సన్మానం



దోమలపెంట: దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డిని దోమలపెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆదివారం ఈగలపెంటలోని జెన్‌కో అతిథి గృహం కృష్ణవేణి ఎదుట సన్మానించారు. శ్రీశైలం దర్శనం అనంతరం ఎమ్మెల్యే భూగర్భ కేంద్రాన్ని సందర్శించారు. నాయకులు మోయిజ్, గురువయ్య,సిరాజ్, రసూల్ తదితరులు కలిశారు.

సేవలను విస్తరిస్తాం

కల్వకుర్తిరూరల్: లయన్స్‌క్లబ్ ఆమనగల్ ఆధ్వర్యంలో సామాజిక సేవలను మరింత విస్తృతం చేస్తామని క్లబ్ అధ్యక్షుడు లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని లయన్స్ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు చేపట్టిన సామాజిక సేవలు, రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ దామోదర్‌రెడ్డి, మహేష్, నరసింహ, రాంరెడ్డి, రాంచంద్రారెడ్డి, జూలూరి రమేష్, వెంకటేష్, మురళీధర్, పీఆర్‌ఓ పాషా తదితరులు పాల్గొన్నారు.



కోడేరులో..



బల్మూర్ మండలం చెన్నారంలో..

ఘనంగా దసరా సంబరాలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దసరా పండుగ సంబురాలు అంబరాన్నంటాయి. శనివారం తెల్లవారుజాము నుంచే ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, మద్దిమడుగు ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించారు. సాయంత్రం జమ్మి చెట్లకు శమీ పూజలు చేశారు. జమ్మి పత్రాలను పెద్దలకు ఇచ్చి దీవెనలు పొందారు. మిత్రులు అలింగనం చేసుకొని దసరా శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బంధుమిత్రులతో కలిసి విందులు, వినోదాలు పంచుకున్నారు. ఆయుధ పూజలు చేశారు. తాడూరు మండలం ఐతోల్‌లో కల్కి సినిమా దర్శకుడు నాగశ్విన్ దసరా వేడుకల్లో పాల్గొని సందడి చేశారు. పలు గ్రామాల్లో క్రీడాపోటీలు ఏర్పాటు చేశారు.



కల్వకుర్తి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద శమీ పూజలు



తాడూరులో..



చారకొండ మండలం జూపల్లిలో..



తెలకపల్లిలో..



అమ్రాబాద్‌లో..



పెంట్లవెల్లి మండలం మంచాలకట్టలో..



నాగర్‌కర్నూల్ మండలం గన్యాగులలో శమీపూజకు బయలుదేరి వెళ్తున్న గ్రామస్తులు



చారకొండ మండలం జూపల్లిలో..

విజేతలకు బహుమతుల ప్రదానం



కల్వకుర్తి మండలం తర్నికల్‌లో బహుమతులు అందజేస్తున్న నాయకులు



వెల్దండ మండలం చెదురుపల్లిలో..

వెల్దండ: మండలంలోని చెదురుపల్లిలో క్రికెట్ టోర్నమెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన టోర్నమెంట్‌లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. మూడు రోజులుగా నిర్వహించిన పోటీల్లో మధుసూదన్‌రెడ్డి టీం మొదటి విజేతగా, శ్రీకాంత్ టీమ్ రెండో విజేతగా నిలిచారు. మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్యగౌడు బహుమతులను ప్రదానం చేశారు. మాజీ ఎంపీటీసీ అంజయ్య, నాయకులు పోలే అశోక్, మధుసూదన్, తిరుపతయ్య, సహదేవ్, మహేష్,ప్రసాద్, అంజి, శివరామరాజు తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌లో ఐదు రోజులపాటు నిర్వహించిన క్రికెట్ పోటీలు ఆదివారం ముగిసాయి. విజేతగా తర్నికల్ పవర్‌హిట్టర్స్ జట్టు, తర్నికల్ ఫ్రెండ్స్ వారియర్ జట్టు రెండో స్థానంలో నిలిచాయి. మొదటి బహుమతిని గ్రామానికి చెందిన గారెల సత్యం రూ.15 వేలు, రెండో విజేతకు రూ.10 వేలు అందించారు. నిర్వాహకులు అఫ్రోజ్, శ్రీశైలం, క్రీడాకారులు పాల్గొన్నారు.

పండుగపూట తాగునీటి సమస్య



చారకొండ: మండలంలోని చంద్రాయన్‌పల్లిలో తాగునీటి ఎద్దడి ఏర్పడింది. మూడు రోజులుగా మిషన్ భగీరథ తాగునీరు సరాఫరా నిలిచిపోవడంతో గ్రామస్తులు పడరాని పాట్లు పడ్డారు. పండుగ పూట తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. మూడు బోర్లకు గాను రెండు బోర్లు పని చేయకపోవడంతో సమస్య తలెత్తింది. దీంతో పంచాయతీ నుంచి ట్యాంకర్ ద్వారా నీటి సరాఫరా చేశారు. గ్రామంలో నీటి సమస్య రాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఈఓ సంతోష్ తెలిపారు.

బతుకమ్మ వెళ్లి రావమ్మా..



ఉప్పునుంతలలో బతుకమ్మలతో మహిళలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో ఉత్సవాలు అంబరాన్నంటాయి. శనివారం బతుకమ్మల నిమజ్జనం సందర్భంగా మహిళలు బొడ్డెమ్మ, బతుకమ్మ పాటలకు అనుగుణంగా నృత్యాలు చేశారు. అనంతరం సమీప చెరువుల్లో నిమజ్జనం చేశారు. అచ్చంపేటలో నిర్వహించిన నల్లమల మహా బతుకమ్మ పోటీలలో లింగాల మండల గ్రామైక్య సంఘం పాల్గొని మొదటి బహుమతి రూ. 50 వేలు అందుకున్నారు. కల్వకుర్తి, వెల్దండ, పెద్దకొత్తపల్లిలో బతుకమ్మలకు ప్రత్యేక పూజలు చేశారు.



పెద్దకొత్తపల్లిలో..



నల్లమలలో గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ



వెల్దండ మండలం బొల్లంపల్లిలో..



కల్వకుర్తి మండలం గుండూరులో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ముగిసిన నవరాత్రి ఉత్సవాలు



నాగర్‌కర్నూల్ రాజరాజేశ్వరిమాతగా..



తాడూరు మండలం శిర్సవాడలో అమ్మవారికి నివేదన సమర్పిస్తున్న భక్తులు



తిమ్మాజిపేట మండలంలోని అప్పాజిపల్లిలో అమ్మవారి ఊరేగింపు

సాక్షి, నెట్‌వర్క్: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాలలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆదివారం నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, పెద్దకొత్తపల్లి, తెలకపల్లి, తాడూరులలో అమ్మవారి ఊరేగింపు నేత్రపర్వంగా కొనసాగింది. కల్వకుర్తిలో మహిళలు దాండియా ఆటలు ఆడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. లడ్డు, చీరల వేలంలో రూ. 18 లక్షల ఆదాయం సమకూర్చినట్లు వాసవీకన్యక పరమేశ్వరి ఆలయ చైర్మన్ రమేష్‌బాబు తెలిపారు. పెద్దకొత్తపల్లి పెద్దకార్వాములలో వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాతకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ విద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఎడమ పాతాళగంగ స్నానాలఘాట్ వద్ద కృష్ణానదిలో కేంద్రం ఇంజినీర్లు, ఉద్యోగులు నిమజ్జనం చేశారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు



తిరుమలాపూర్ రోడ్డులో వేలాడుతున్న విద్యుత్ తీగలు

తాడూరు: మండలంలోని చర్లిటిక్యాల గ్రామంలో రైతుల పొలాల వద్ద విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో సమీప పొలాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామం నుంచి తిరుమలాపురం వెళ్లే ప్రధాన రోడ్డుకు అనుసరించి రైతులు సాగు చేసిన వరి పంటలపై విద్యుత్ తీగలు తెగి వేలాడుతున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పరిశీలించి తాత్కాలిక మరమ్మతు చేపట్టాలని కోరుతున్నారు.

మక్కా యాత్రికులకు సన్మానం

అచ్చంపేట రూరల్: మక్కా యాత్రకు వెళ్తున్న ముసిస్లింలను ఆదివారం పట్టణంలోని 18వ వార్డు కౌన్సిలర్ గోపిశెట్టి శివ, స్థానికులు సన్మానించారు. మక్కాకు వెళ్తున్న ఎండీ జాహంగీర్, అమీర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఇంతియాజ్, రహ్మత్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పరామర్శ

అమ్రాబాద్: మండలంలోని కొత్తపల్లిలో ఎస్‌ఏస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రామావత్ సంతోష్‌నాయక్ తండ్రి జైపాల్(58) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలి

పాన్‌గల్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి కార్యకర్త ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జబ్బార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల కమిటీ సభ్యులు జి.వెంకటయ్య అధ్యక్షతన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించినట్లు జబ్బార్ పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను 100 రోజుల్లోనే అమలు చేస్తామని 11 నెలలు కావస్తున్నా అమలు చేయడంలేదన్నారు.